# ముల్లు!

నా బాస్ ఎం.డి. పొజిషన్లో వున్నా నాతో క్లోజ్‌గా మూవ్ అవుతూ జోలియల్‌గా వుంటాడు.

ఇద్దరం ఒకేసారి ఎం.బి.ఎ. చేశాం! అతను స్టేట్స్‌లో అయిదేళ్లువుండి వచ్చాడు. వస్తూ డాలర్లు మూట కట్టుకొచ్చాడు.

నేను సీనియర్ పొబిషన్లో వుండగ.. అతను కంపెనీ ఎం.డి.గ అపాయింట్ అయినాడు.

నేను పని చేసే కంపెనీకే మనోజ్ ఎం.డి.గ వచ్చాడని తెల్సుకోగానే హాపీ ఫీలయ్యాను. ఊహకు అందని మధురమైన స్మృతులేవో నా మదిలో మెదిలినయ్! నాలో నేను నవ్వుకున్నాను. వెంటనే వెళ్లి కల్సుకోవటానికి డెలికసీ ఫీలైనాను.

ఎంత ఫ్రెండైనా మనోజ్ కంపెనీకి టాప్ బాస్!

నాకంటే నాలుగు మెట్లెక్కువ. పలుకరించటానికి వెళ్లినప్పుడు నన్నెలా రిసీవ్ చేసుకుంటాడో అనే జంకు నాకు లేక పోలేదు.

ఎం.డి. అంటే మాటలా? నెలకు లక్షన్నర శాలరీ! ఫ్రీ ఎకామిడేషన్ కింద కంపెనీ ఓ విల్లా ఇచ్చింది... వాడుకోవటానికి కంటెస్సా కారు.

నాకు మనోజ్ పొజిషన్ చూచి జెలసీ లేదు. అతని శాలరీలో నాలుగో వంతుంటుంది. నాకొచ్చే నెల జీతం! మనోజ్ కింద పని చేయాల్సి వచ్చినందుకు నాకేమాత్రం బాధగ లేదు.

స్టాఫ్ అంతా వెళ్లి కొత్త ఎం.డి.ని కలిసి శుభాకాంక్షలు తెలిపర్చి 'బొకే'లు చేతికిచ్చివచ్చారు. అందరితో పాటు నేనూ వెళ్లటానికి మనస్కరించలేదు.

నేనసలు ఇదే కంపెనీలో సీనియర్ పొజిషన్లో వున్నాననే విషయం మనోజ్‌కి తెలుసోలేదో?

నేను వంటరిగానే వెళ్లాలి! వెళ్లి కలిసినపుడు నన్నెలా రిసీవ్ చేసుకుంటాడో? నన్ను గుర్తించనట్టు నటిస్తాడా?... నాలో ఎన్నెన్నో ప్రశ్నలు!

నో! మనోజ్ అలా ఎన్నటికీ చేయడు. మంచి సంస్కారం కలవాడు. చాలా డీసెంట్ పర్సన్! కాకపోతే సబార్డినేట్‌ను కాబట్టి నేను వూహించినంత చనువుగా నాతో వుండకపోవచ్చు!

మనోజ్ గురించి నాకు బాగా తెలుసు! మిడిల్‌క్లాస్ ఫ్యామిలీలోంచి కష్టపడి చదివి వృద్ధిలోకొచ్చిన బ్రిలియంట్! మనోజ్ టేలెంటెడ్ పర్సన్! అప్పట్లో అప్పుచేసి అమెరికా వెళ్లాడు.

ఇండియాకు రాగానే ఎం.డి. పదవి మనోజ్‌ని వరించటం మరో అదృష్టం!

మా డాడీకి నేనొక్కడినే! డాడీ వ్యవసాయం చేస్తూ... ఏడాదికి మూడు పంటలు పండిస్తూ..వడ్డీ వ్యాపారం చేస్తూ బాగాసంపాదించాడు. సంపాదన మీదే ఆయన దృష్టి అంతా!

నాకు అన్నీ అవసరాలు తీరుతుండేవి! జేబు నిండా డబ్బుండేది. అవసరం గొంతు మీదికొచ్చినపుడు నా వద్ద మనోజ్ అప్పు తీసుకుంటూండేవాడు.

నన్ను ఫారిన్ పంపటానికి డాడీ వప్పుకోలేదు. ఒక్కగా నొక్క కొడుకు నైన నన్ను విడిచి పెట్టి క్షణం కూడా ఉండలేనంటూ బెంగ పడ్డాడు. నా ఫ్యూచర్ మాటెలావున్నా... నాన్న కోరిక మేరకు ఇండియా వదలి, ఇతర దేశాలకు వెళ్లలేక పోయాను. అందుకు బాధపడ్లేదు. 'లక్‌లేదనుకున్నాను. దట్సాల్!

'సార్... మిమ్మల్ని కొత్త ఎం.డి. గారు పిలుస్తున్నారు...' అంటెండరొచ్చి చెప్పగానే నాలో నున్న ఆలోచనల్ల దొంతర్లు పటాపంచలైనయ్.

కలవలేదని నామీద కోపం వచ్చిందో ఏమో... నాలో నేను గొణుక్కుంటూ... చేసిన తప్పిదానికి తిట్టుకుంటూ నా కేబిన్లోంచి బైటికొచ్చి వేగంగా ఎం.డి ఛాంబర్ చేరుకుని డోర్ వద్దే లిప్తపాటు ఆగేను.

తలుపు తోసుకుని లోనికి వెళ్లానోలేదో... 'రావోయ్...రా!.. చాలా ఏళ్లకి మనం మళ్లీ కల్సుకున్నాం! కమాన్ టేక్ యువర్ సీట్.. అత్యంత అభిమానంగా పలుకరించినందుకు ముగ్ధుడనైనాను. మనసు సంతోషంతో మురిసింది.

మనోజ్ ట్రిమ్‌గా ఫుల్ సూట్‌లో వుంటాడని వూహించుకున్నా నాకు... అతని సింప్లిసిటీ చూచి నివ్వెరపోయాను.

'సారీ! వెంటనే మిమ్మల్ని కల్సుకోలేక పోయాను. వంటరిగా కల్సుకోవాలనే ఆలోచనతో కాస్తంత వెనుకపడ్డాను...' తప్పు చేసిన వాడిలా తలవంచుకున్నాను.

'సో... మహేష్... యువార్ హియర్! వెరీ గ్లాడ్!... చూశావా అనుకోకుండా ఇద్దరం ఒక చోటికే చేరుకున్నాం!.. కాకపోతే... పొజిషన్స్‌లో తేడా.. దట్సాల్...

'అవున్సార్...'

'నో! సారీలేదు గీరీలేదు. నన్ను మనోజ్ అనే పిలవటం నాకు ఇష్టం. చదువుకునే రోజుల్లో మనిద్దరం ఎంత క్లోజ్‌గా వుండే వాళ్లం?... నీ దగ్గర డబ్బు అప్పు తీసుకున్న రోజులు ఇంకా నాకు గుర్తున్నయ్'

వావ్!.. ఎంత మంచి వాడు మనోజ్..? నేను వూహించిన స్నేహం...మర్యాద...మంచితనం అతనిలో వున్నందుకు మనసులోనే అభినందించాను. మాట తీరు... మేనర్స్ ఏం మారలేదు.

మనోజ్ వంటి వాళ్లు ఈ హైక్లాస్ సొసైటీలో ఎందరుంటారనిపించింది. కాకపోతే స్టేటస్

వెళ్లొచ్చినవాడు కావటంతో ఇంగ్లీషు మాట్లాడు తున్నప్పుడు అమెరికన్ 'ఏక్సుంట్' కన్పిస్తోంది. మనిషి రంగొచ్చి కాస్త వళ్లు చేశాడంతే!

'మన కంపెనీ మేటర్స్ ఎలా వున్నాయ్ మహేష్? గ్రోయింగ్ హీరోవి... ఎదుగు బొదుగూ లేకుండా సీనియర్ పొజిషన్లోనే ఎన్నేళ్లుంటావ్? ఫర్వి బెటర్ పోజిషన్ కోసం మరో కంపెనీలోకి జంప్ చేసివుండాల్సింది! అవున్లే. నీకు బెటర్ పొజిషన్లు... పెద్ద శాలరీలతో పనేముంది? మీ డాడీకి నువ్వు బంగారు పిచ్చుకవి కదా?...

ఏం బదులివ్వాలో నాకు తోచలేదు. సైలెంట్మూడ్లో వుండిపోయాను.

'మనిద్దరం ఒకే ఆర్గనైజేషన్లో వున్నాం కాబట్టి... కంపెనీని మరింత లాభాల్లోకి ముందుకు నడిపించాలి? ఇక్కడ వున్న వారిలో సీనియర్వి నువ్వే కనుక నన్ను అన్ని యాంగిల్స్లో గైడ్ చేయాలి!... తప్పదు మహేష్...' నవ్వేడు మనోజ్.

'యాజ్యు లైకిట్'

'అదేమిటి? షెక్స్పియర్ డ్రామానా?'

'నోనో! ఆర్టసీ వాళ్లిచ్చే బస్పాస్ టిక్కెట్టు!'

ఇద్దరం మనసారా నవ్వుకున్నాం!

'అవునూ.. ఈ జాబ్ నీ టేస్ట్కి సరిపోయినట్టుగా వుందా? ... కంఫర్టబుల్గా వుందా?

'సోసో...నాట్బేడ్ - మహేష్... నేను నిజాంక్లబ్లో మెంబర్ అవాలనుకుంటున్నాను. అక్కడొక్క చోటే బిలియడ్స్ వుందట! ఆగేమ్ అంటే నాకెంతో లైకింగ్. ఈవెనింగ్ కాగానే క్లబ్కి వెళ్లటం అమెరికాలో వుండగ అలవాటైంది..' వెనక్కు వాలి రిలాక్సయ్యాడు.

అతని కల్చర్కి హైలెవల్ థింకింగ్కి విస్తు పోవటం నావంతైంది. ఎంతైనా ఎం.డి. పొజిషన్లో వున్న వాడు కదా? క్లబ్బులు... పెబ్బులు.. లైఫ్ ఎంత జల్సాగానైనా గడపచ్చు అన్పించింది.

'నువ్వు అప్పుడు ఇప్పుడు ఒకే విధంగా రోటీన్గా వున్నావ్! నో ఛేంజ్! డబ్బుండగానే సరిపోదు. దాన్ని ఖర్చు చేయటం కూడా తెలియాలి.. బైదిబై... నువ్వూ ఆ క్లబ్లో మెంబరువా?

నాకు క్లబ్తో.. డ్రింక్స్తో... కార్డ్స్తో... పనేముంది?... ఆ సంగతి బైటికి అన్లేకపోయాను.

'దిక్కుమాలిన మన రోడ్ల మీద..ట్రాఫిక్ జామ్స్ మధ్య కారు నడపాలంటేనే హెడేగ్గావుంది. ఎన్నేళ్లు పోయినా మన మనుషులు.. కల్చరు బాగుపడదు. అంతా సెల్ఫిష్ ఫెలోస్!

అన్నింటా రాజకీయ పరమైన ఇన్వాల్మెంట్సే.. విసుగుతో నొసలు చిట్లించాడు మనోజ్.

'అవునవును. మన రోడ్లపై కాంటెస్సాలో వెడుతున్నా గుర్రబండిలో ట్రావెల్ చేస్తున్నట్టుంది.

ఇంతలో రెండు కూల్డ్రింక్స్ తెచ్చి స్ట్రా వేసి వాళ్ల ముందుంచి తిరిగి వెళ్లి పోయాడు బోయ్.

సిప్ చేస్తూ 'నువ్వు మేరేజ్ చేసుకున్నావా? చిల్డ్రనెంతమంది? నీ మిసెస్ హేండ్సమ్‌గా వుంటుందా' అడిగేడు మనోజ్ బాస్. ఏం చెప్పగలను? గొంతులో వలక్కాయ పడ్డట్టు.. కుడితిలో ఎలుక పడ్డట్టు తెగ ఫీలైనాను. మనసు విలవిల్లాడి గిలగిలా కొట్టుకున్నట్టనిపించింది.

నా పరిస్థితి కన్ఫ్యూజన్ పసికట్టేడేమో.. 'ఎనీ ప్రాబ్లమ్?' క్వశ్చన్ చేశాడు.

లేని రాని నవ్వు ముఖాన పులుముకుని 'నథింగ్' అని అబద్ధమాడేను.

మనోజ్ తో పని చేయటం ఒక విధంగా హేపీగానే వుంది. సబార్డినేట్స్ అందరితోనూ క్లోజ్‌గా మూవ్ కావటమనేది మనోజ్‌కి ప్లస్ పాయింట్!

హేరేస్‌మెంట్ లేదు. లేటవర్స్ కూర్చోమని కంపెల్‌చేయడు. మిలిటరీ డిసిప్లిన్ కావాలనుకునే తత్వం కాదు అతనిది.

ఇండియన్ సిటిజన్ అయినా ఫారిన్లో వుండొచ్చిన వాడు కావటంతో ఠంచన్‌గా ఆఫీసుకు రావటం.. వర్కింగ్ అవర్స్ అవగానే వెళ్లి పోవటానికి మనోజ్‌తో పాటు అందరూ అలవాటు పడ్డారు.

ఇదొక శుభ పరిణామం! పంక్చువాలిటీ అంటే ఏమిటో మనోజ్‌ని చూచి నేర్చుకోవాలి!

ఒక రోజున..

'కమాన్ మహేష్... ఈ రోజు మనిద్దరం నా కార్లోనే వెళ్దాం! నిన్ను మీ ఇంటి దగ్గర డ్రాప్ చేస్తాను..'

ఆ మాటకి నా గుండె గతుక్కుమంది.

నో! మనోజ్ నా ఇంటికి రావటానికి వీల్లేదు. వచ్చాక అంతను వేసే ప్రశ్నలకు జవాబులు నా వద్ద వుండవ్...

'థాంక్యూ ఫ్రెండ్.. నాకు వెహికిల్‌వుంది'. 'ముక్త సరిగ జవాబిచ్చాను.

'టూ వీలరా?...'

'ఫోర్ వీలరే' అని చెప్పానే కానీ.. నాది ఓల్డ్ మోడల్ మారుతీ 800 అన్చెప్పటానికి బిడియ పడ్డాను.దాని కండిషన్ చూస్తుంటే నాకే వాంతి వచ్చేట్టుంటుంది. దానికి మరో మారు పేరు ఓల్డ్ హిందీ సినిమా టైటిల్ 'చల్తికనామ్ గాడీ'.

అలాంటి డర్టీ కారు నాకున్దని తెలిస్తే నన్ను అసహ్యంచుకుంటాడు. నా టేస్ట్‌ను కామెంట్ చేస్తాడు. అది నాకిష్టముండదు.

'నీ వెహికల్ కేంపస్‌లోనే ఈ రోజుకి వదిలెయ్. నాకార్లో సరదాగ కబుర్లు చెప్పుకుంటూ మంచి రెస్టారెంట్‌కి వెళ్లి కాస్సేపు హాయిగా ఆనందంగా కాలక్షేపం చేద్దాం! అన్నట్టు ఇక్కడిబార్స్‌లో పబ్స్‌లో కేబరే డాన్సలున్నాయా?

నాకు అలాంటి టేస్ట్ లేదనే విషయం తెలీక నన్నడిగేడు పిచ్చోడు. మనసులో గొణుక్కున్నాను.

మరీ కంపెప్ చేయటంలో మనోజ్ వెంట బయల్దేరక తప్పలేదు.

డ్రైవర్‌ని వెళ్లి పొమ్మని తనే స్టీరింగ్ ముందు కూర్చుని 'కమాన్ సిట్' అంటూ ఫ్రంట్ సీటు చూపేడు.

'అమెరికాలో అయితే రోడ్లపై కార్లు 'జెట్స్'లా వెడతాయ్. ఇక్కడ అన్నీ అవరోధాలు... అంతరాయాలు... మనవాళ్ల కసలు రోడ్లపై నడవటం కూడా బొత్తిగా తెలీదు. వెహికిల్స్ సంగతి సరేసరి. జిగ్‌జాగ్‌గ వెడుతూంటాయ్. మనవాళ్ల కసలు ట్రాఫిక్ సెన్స్ లేదు. మరో వందేళ్లు గడిచినా రాదు. డ్రైవ్ చేస్తూ మాట్లాడేస్తున్నాడు మనోజ్.

నేను మాత్రం బాస్ కామెంట్స్ వింటూ వున్నాను.

'నువ్వు చదువుకునే రోజుల్లో మంచి క్రికెట్ ప్లేయర్‌వి కదూ?...ఇప్పుడు మానేశావా?...పోనీ కార్డు అయినా ఆడటం నేర్చు కున్నావా?..

అదీ వెక్కిరింపో..ఎగతాళో నాకు బోధపడక పేలవంగ అర్థంలేని నవ్వు నవ్వేను.

కాంటెస్సా రెస్టారెంట్ ముందు ఆగింది. కారు కీస్ సెక్యూరిటీ దోసిట్లో పడేట్టు విసిరాడు. అతను కారు డ్రైవ్ చేస్తూ అక్కడున్న కాస్తంత స్థలంలో పార్క్ చేసాడు.

మేమిద్దరం రెస్టారెంట్లోకి నడిచాం! ఈవినింగ్ అయిదున్నరకే లోపలంతా డిమ్‌లైట్స్‌తో చీకటిని మురిపిస్తోంది.

నో స్మోకింగ్‌బోర్డున్నా సిగరెట్ పొగ దట్టంగా అక్కడ అలుముకున్నట్టుగా వుంది!

ఇదీ కాస్ట్లీ అనబడే మన రెస్టారెంట్స్ దుస్థితి పక్కనున్న నాకు మాత్రమే విన్పించేటంతో లోవాయిస్‌లోఅన్నాడు మనోజ్.

'డైలీ ఇక్కడికొచ్చి ఓ అరగంట కూర్చుంటే చాలు.. కేన్సర్ తప్పక వస్తుంది...' కామెంట్ చేసాను.

ఓ మూల కాళీగ వున్న రెండు సీట్స్‌లో కూర్చుని వెయిటర్ రాగానే రెండు కాఫీ తెమ్మని ఆర్డరిచ్చాడు మనోజ్.

చెప్పిన అరగంట కొచ్చింది కాఫీ! నాకైతే సుఖం లేకపోగా ముళ్లమీద కూర్చున్నట్టే వుంది. బాస్ పక్కనున్నాడనే మేనర్స్ కోసం భరిస్తూవచ్చాను.

బైటికి రాగానే 'బాస్! నే వెడతాను. నాక్కాస్త దోవలో పనుంది...' అనేసి మనోజ్ పర్మిషన్ కోసం వెయిట్ చేయకుండానే ఆటో నిలిపి ఎక్కేసాను.

★★★★★

నా పర్సనల్ మేటర్స్‌లో ఎవరైనా తలదూరిస్తే సహించను. నా అభిప్రాయాలు నిర్ణయాలు నావి! వాటిని కాదనే హక్కు ఎవరికీ లేదు.

మనోజ్ నీకు పెళ్లయిందా?- పిల్లలెంతమంది? వైఫ్ బ్యూటిఫుల్‌గా వుంటుందాని ప్రశ్నల వర్షం కురిపించినప్పుడు నాకు వళ్లు మండినట్టయింది.

నేను అతడిని ప్రశ్నించచ్చుగా? కానీ అడగలేదు. 'మేనర్స్' అడ్డొచ్చింది.

మనోజ్ గురించి నాలోనేను అనేకం అనుకున్నాను. అక్కడవుండగా అమెరికన్ లేడీని లవ్ చేసి మేరేజ్ చేసుకుని వుండచ్చన్పించింది. వాడికి చిల్డ్రన్ ఎందరో నాకు అనవసరం!

అతను మేరీడ్ అయినట్టయితే నన్నెందుకు ఒక్కసారైనా తన బంగళాకి డిన్నర్‌కు రమ్మని అహ్వానించలేదు. ఏమో? - అతని కారణాలు అతని కుంటాయ్.

పోనీ నేనైనా మనోజ్‌ని ఇంటికి రమ్మన్నా? లేదే? - నాకు ఫామిలీ ఎక్కడేడ్చింది. పెళ్లయిన ఏడాది తిరక్క ముందే మమ్మీడాడీ ఇద్దరూ చనిపోవటం నన్నెంతో బాధించింది.

మోస్ట్ బ్యూటిపుల్ లేడీ ఆన్‌ది ఎర్త్ అన్పించే సుష్మను పెళ్లి చేసుకున్నానన్న మాటేగానీ... సుఖపడి చచ్చిందెపుడు?

నా డబ్బంతా ఆమె బ్యూటీ పార్లర్ ఖర్చుకు డ్రెస్‌లకు సరిపోతూండేది.

ఎప్పుడూ వర్రీడ్‌గ.. మనసంతా గందర గోళంగా వుండేది. మనశ్శాంతి కరువవటం నాకిష్టముండేది కాదు. నేను కన్న కలలు .. ఆశలు... అన్నీ గాలికి కొట్టుకు పోయినందుకు ఎంతగానో మనసు కలత చెంది గాయపడేది.

ఫాషన్ పెరేడ్స్‌లో పాల్గొనేది. ఇంటిపట్టున భర్తకు సేవచేస్తూ సుఖంగ వుండాలనే ఆలోచనే సుష్మలో మృగ్యమౌటం నన్ను వేధించసాగాయి.

ముంబై... కోల్‌కత్తా.. ఢిల్లీ.. బెంగుళూరు చెన్నైవంటి సిటీలకు ఫ్లైట్లో ట్రావెల్ చేస్తూ... కనీసం నెలలో పదిరోజులైనా ఇంట్లో వుండని సుష్మని చూస్తూ సహించలేక పోయేవాడిని.

అదేమంటే ఆమె దృష్టిలో నేనొక శాడిస్ట్‌ననేది. నాకు టేస్ట్ లేదనేది. విలాసాలకు ఖర్చు చేయటం చేతగాని పిసినారి అంటూ నాకెన్నో బిరుదులిచ్చి నన్ను లక్ష్యపెట్టటం మానేసిందని గ్రహించాను.

నో! ఇక లాభం లేదు. పరిస్థితి చేయి దాటక ముందే సుష్మను అదుపులో పెట్టాలన్పించింది.

నా ఆలోచన కార్యరూపం తాల్చక ముందే సుష్మే నాకు దూరమై 'డైవోర్స్' నోటీసు ఇచ్చింది.

ఛ! వెధవ బతుకు అన్పించి నన్ను నేను తిట్టుకున్నాను. ఆ క్షణం నుండి మరో ఆడదాని వైపు కన్నెత్తైనా చూడటానికి మనస్కరించలేదు.

★★★★★

నేను అప్పుడే మనోజ్ ఏ.సీ. ఛాంబర్లోకి అడుగు పెట్టాను. అతను లేచి నిలబడి బైటికి వెళ్లే ప్రయత్నంలో వుండటం గమనించాను.

'సమయానికొచ్చేవ్ మహేష్! హోటల్ టూరెంటోలో ఫేషన్ పెరేడ్‌వుంది. ఆ ప్రోగ్రామ్ మన కంపెనీయే స్పాన్సర్ చేస్తోంది. నువ్వూ రా వెడదాం" గడగడా మాట్లాడేడు నన్ను చూస్తూ.

'నాకలాంటివి ఇష్టముండదు. పైగా టేస్ట్ లేని వాడిని. మీరు వెడితేనే అందం...' నా రిప్లై నచ్చలేదో ఏమో విసవిసా నడుచుకుంటూ లిఫ్ట్ కేసి దారి తీశాడు.

★★★★★

ఆరు నెలలకాలం అతిసునాయాసంగా గడిచిపోయింది.

వన్‌ఫైన్‌డే నన్ను తన ఛేంబర్లోకి పిలిపించుకుని 'నైట్ డిన్నర్‌కి నా విల్లాకొస్తున్నావ్.కమాన్ గెట్ రెడీ' ఆజ్ఞాపించినట్టే మాట్లాడాడు మనోజ్.

బాస్ ఈజ్ అల్వేస్ రైట్ కదాని 'నో' చెప్పలేక పోయాను.

ఆఫీస్ అవర్స్ ముగియగానే ఇద్దరం 'కాంటెస్సా'లో బయలుదేరాం!

ఎప్పుడూ గలగల మాట్లాడే బాస్ కారుడ్రైవ్ చేస్తున్నంత సేపు సైలెంట్‌గా వుండటం నన్ను ఆశ్చర్య పరిచింది.

ఇప్పటి వరకూ మూడ్ బాగానేవుంది కదా?! ఎందుకు ఇలా వున్నాడో నా వూహకి అందలేదు.

కారు విల్లా పోర్టికోలో ఆగింది! విల్లా ఎంతో ఆధునాతనంగ అద్భుతంగా వున్నందుకు ముగ్ధుడినైనాను. ప్రహరీకి బిల్డింగ్‌కు మధ్య విశాలమైన స్థలం. అందులో ఫౌంటేన్.. మరో వైపు స్విమ్మింగ్ ఫూల్. పచ్చని తివాచీ పరిచినట్టులాన్.. రకరకాల పూల మొక్కలు.. గేటు ముందు సెక్యూరిటీ..ఓహో! అక్కడి పరిసరాలు చూస్తూ ముగ్ధుడినయ్యాను.

ఇద్దరం లోనికి నడిచాం!

'నువ్వు ఫ్రెష్ అవుతావా?' అడిగేడు.

తల అడ్డంగా ఆడిస్తూ 'నో' అని చెప్పాను.

'నువ్వు మేగజైన్స్ చూస్తుండు..నేను డ్రెస్ ఛేంజ్ చేసుకొస్తాను..'లోపలికెళ్లాడు మనోజ్.

లోపల గోడలకు వేసిన కలర్ కాంబినేషన్స్ నన్ను చకితున్ని చేసినయ్. అక్కడక్కడ అగుపించే తైలవర్ణచిత్రాలు.. సెమీ న్యూడ్ భామల ఫోటోలు!... వాటిని నోరు తెరుచుకుని చూస్తూ నన్నునేను మరిచిపోయాను.

హృదాయాన్ని సున్నితంగా తాకుతూ మంద్రస్థాయిలో మ్యూజిక్ విన్పించటం చూచి

నివ్వెర పోయాను. అంత పెద్ద హాల్లో ఒక వేపు 'పియానో' అవుపించింది. వాయిస్తాడు కాబోలు.. నాలోనేను గొణుక్కున్నాను.

ఇంతలో ఫ్రెష్ అయిన మనోజ్ రానే వచ్చాడు. వచ్చి పక్కనే కూర్చుంటూ 'సువ్వీరోజు నాతో హాట్ తీసుకుంటున్నావ్. తర్వాత డిన్నర్.. నీమతి పోయేలా వుంటాయ్ ఏర్పాట్లు' హుషారుగా మట్లాడాడు.

నౌకరు తెచ్చి డ్రింక్స్ సర్వ్ చేసాడు.

ఇదే ఫస్ట్ టైమ్! డ్రింక్స్ రుచి ఎరుగని వాడిని. అయినా మనోజ్ ఇంట్లో అద్భుతమైన వాతావరణానికి లోనై అడగ్గానే యస్సనేశాను. ఐవాంట్ టు షేర్ ది జాయ్....

'బైదిబై..నీకు చెప్పలేదు కదూ... నాది లవ్ మేరేజ్! రీసెంట్‌గానే చేసుకున్నాను. ఎవ్వరికీ చెప్పలేదు. అందుకే నీకీ పార్టీ!...సారీ... లేటుగా ఇస్తున్నందుకు డోన్ట్ మిస్టేక్‌మీ!... అనేసి మరోసిప్ లాగించాడు మనోజ్.

'మై వైఫ్ ఈజ్ మోస్ట్ బ్యూటీఫుల్ లేడీ ఆన్‌ది ఎర్త్!- తొలిచూపులోనే ఇద్దరం దగ్గరైనాం! వెంటనే ఏకమైనాం!

అదిగో... మెట్లుదిగి వస్తోంది భూలోక సుందరిలా..లుక్..

నేను తలపక్కకు తిప్పాను.

నా చేతిలో మందు గ్లాసు జారి నేలమీద పడి ముక్కలైంది. తుళ్లిపడ్డాను.

ఎప్పుడో ముక్కలైన నా హృదయం మరోసారి తునాతునకలైనట్టన్పించింది.

స్టెప్స్ దిగివస్తున్న సుష్మను చూచే సరికి నా గుండెలో ముల్లు గుచ్చుకున్నట్టయింది.

సుష్మ ముఖంలో ఎలాంటి భావం అవుపించలేదు. గుండెలు పిండిన సన్నివేశాన్ని చూసి సహించే శక్తి కోల్పోయిన నేను మనోజ్‌కి చెప్పకుండానే వడివడిగా బైటికి నడిచాను.

పరిస్థితి అర్థంకాని మనోజ్ వెర్రివాడిలా దిక్కులు చూస్తూ వుండిపోయాడు.

తొణకని నిండు కుండలా మనోజ్ దగ్గర కొచ్చి అతని సరసనే కూర్చుని తాను షాంపెయిన్ షేర్ చేసుకుంది సుష్మ!

-:(సమాప్తం):-

కథా నిలయం
శ్రీకాకుళం